క్లుప్తంగా

పోలీసు స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి

పాములపాడు: స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన సీఐ పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంపై పోలీసుల నిఘా నిత్యం ఉండాలన్నారు. ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించొద్దని, కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. అదేవిధంగా నాటుసారా, అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని, కేసులు నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐ సురేష్ బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్ర పారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మానవ హక్కులదినోత్సవం



మాట్లాడుతున్న అధ్యాపకులు

శ్రీశైలం ప్రాజెక్ట్: సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.హుస్సేన్‌బాషా, అధ్యాపకుడు ఎస్.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ హక్కులు ఉన్నాయన్నారు. వాటిపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం పద్మ, డాక్టర్ కె రాజన్న, ఇందిరాప్రియదర్శిని, బాలు పాల్గొన్నారు.

ఎండుతెగుల నివారణకు చర్యలు చేపట్టాలి



కొక్కెరంచలో పొలంపిలుస్తుంది నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

కొత్తపల్లి: కందిపంటలో ఎండుతెగులు నివారణకు చర్యలు చేపట్టాలని ఏఓ మహేష్ సూచించారు. మంగళవారం మండలంలోని కొక్కెరంచ, దుద్యాల గ్రామాల పొలాలల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండుతెగులు నివారణకు కాపర్‌ఆక్సి క్లోరైడ్ మందులను మొక్క మొదలు తడిచే వరకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమ శాఖాధికారి లింగమూర్తి, పశుసంవర్థక శాఖ అధికారి సుబ్బలక్ష్మీ, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి చేయూత



కళాశాల గది డోర్‌ను చూపుతున్న పూర్వ విద్యార్థి వీరబ్రహ్మం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి(1990–92 బ్యాచ్), ప్రస్తుత డీఆర్‌డీఓ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ కమ్మరి వీరబ్రహ్మం రూ.50 వేలు ఖర్చు చేసి కళాశాల తరగతి గదులకు ఇనుప డోర్, కిటికీలను ఏర్పాటు చేయించారు. మంగళవారం కార్పెంటర్‌తో డోర్‌లను, కిటికీలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు పూర్వ విద్యార్థిని అభినందించారు. త్వరలో కళాశాల స్వర్ణోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని, పూర్వ విద్యార్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

నూతన చేతి పంపు ఏర్పాటు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో మంగళవారం నూతన చేతి పంపును ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ వరప్రసాదరావు తెలిపారు. ఎస్సీ కాలనీ వాసులకు తాగునీటి అవసరాలు, గుడికి వచ్చే భక్తులకు చేతి పంపు ఉపయోగపడుతుందని చెప్పారు.

మహానందిలో భక్తుల రద్దీ



మహానంది: మహానందిలో భక్తులరద్దీ కొనసాగుతోంది. మంగళవారం పలు ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాది సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

‘సర్వే’జనా సుఖినోభవంతు

- జిల్లాలో కొనసాగుతున్న ఎన్‌సీడీ 3.0 సర్వే
- ఇప్పటి వరకు 1,03,062 మందికి స్క్రీనింగ్ పరీక్షలు
- 36,641 ఇళ్ల సర్వే పూర్తి
- 871 క్యాన్సర్ అనుమానిత కేసుల గుర్తింపు
- అధికమవుతున్న షుగర్ వ్యాధిగ్రస్తులు
- ముందస్తు గుర్తింపుతో వైద్య చికిత్సకు అవకాశం



కానాలలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

గోస్పాడు: క్యాన్సర్.. ప్రజల ప్రాణాలను హరించి వేసే మహమ్మారి. చాలా మందికి ఆ వ్యాధి వచ్చిందని తెలిసేలోగా మృత్యుఒడిలోకి చేరుతున్నారు. క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం వల్ల మరణాల సంఖ్య పెరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల ఆరోగ్య పరిస్థితిని ముందుగా గుర్తించేందుకు నవంబర్ 14వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఆధ్వర్యంలో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) ప్రోగ్రాంను చేపడుతున్నారు. ఎన్‌సీడీ అనగా అసంక్రమిత వ్యాధులు అని అర్థం. అసంక్రమిత వ్యాధులు అంటే అంటు వ్యాధులతో సంబంధం లేని బీపీ, షుగర్, క్యాన్సర్, కిడ్నీ, గుండె తదితర జబ్బులు. ఈ ప్రోగ్రాం కింద వ్యాధులను ముందుగానే పసిగట్టడానికి చర్యలు చేపట్టారు. వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి నడుంబిగించారు. ఇప్పటి వరకు చేపట్టిన సర్వేలో ప్రజల ఆరోగ్య సమస్యలు వెలుగు చూస్తున్నాయి.

మూడేళ్ల నుంచే సర్వే

ఎన్‌సీడీ సర్వే తొలిసారి 2021 అక్టోబర్‌లో మొదలుపెట్టారు. రెండో విడతగా 20022 అక్టోబర్ 2 నుంచి ఎన్‌సీడీ 2.0, తాజాగా నవంబర్ 14వ తేదీ నుంచి ఎన్‌సీడీ 3.0 సర్వే జరుగుతోంది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వైద్య సిబ్బంది ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు ఇంటింటికి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరిస్తున్నారు.

పరీక్షలు ఇలా

వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి 18 ఏళ్ల నిండిన వారికి పలు రకాల ఆరోగ్య పరీక్షలు చేస్తారు. ముఖ్యంగా మహిళలకు ఆరోగ్య సమస్యలు, నెలసరి వివరాలు, గర్భాశయ ముఖద్వారం, రొమ్ము క్యాన్సర్ వంటి సమస్యలు నమోదు చేయడం ద్వారా క్యాన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు. ఈ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు చేస్తారు. విద్యార్థులకు పాఠశాలల్లోనే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అవసరం అయితే ఆరోగ్యశ్రీ కింద ఇతర నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. ఇక బీపీ, షుగర్ తదితర వ్యాధులకు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీలు, 104 సంచార వైద్య శాలల ద్వారా చికిత్స అందిస్తున్నారు.

నంద్యాల జిల్లాలో వివరాలు ఇలా

మొత్తం జనాభా :	19,14,275
గృహాల సంఖ్య :	5,85,706
సర్వే పూర్తి చేసిన గృహాల సంఖ్య :	36,641
సచివాలయాల సంఖ్య :	516
18ఏళ్లు నిండిన వారు :	14,07,670
స్క్రీనింగ్ పరీక్షలు పొందిన వారు :	1,03,062

జిల్లాలో 3.0 సర్వే వివరాలు ఇలా..

ఇప్పటి వరకు జిల్లాలో 1,03,062 మందికి స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేశారు. వారిలో 9419 మందికి బీపీ, 6926 మందికి షుగర్ వ్యాధి నిర్ధారించారు. అలాగే క్యాన్సర్ అనుమానితులుగా గర్భాశయ ముఖద్వార లక్షణాలు కలిగిన 348మంది, రొమ్ము క్యాన్సర్ 290మంది, నోటి క్యాన్సర్ 233 మందికి అనుమానిత లక్షణాలు ఉన్నట్లు సర్వేలో గుర్తించామని వైద్యాధికారులు చెబుతున్నారు.

సర్వే ద్వారా వెలుగు చూస్తున్న వ్యాధులు

తాజాగా నిర్వహిస్తున్న సర్వేలో బీపీ, షుగర్‌తో పాటు గర్భాశయ ముఖ ద్వారం, రొమ్ము, నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో ముందు వరుసలో బీపీ తరువాత స్థానంలో మధుమేహం ఉంది. అనుమానిత జాబితాలో గర్భాశయ ముఖ ద్వారం క్యాన్సర్, రొమ్ము, నోటి క్యాన్సర్ ఉన్నట్లు సర్వేలో వెల్లడవుతున్నాయి. బీపీ, షుగర్ వ్యాధులను నియంత్రణలో ఉంచుకోకపోతే శరీరంలో ప్రధాన భాగాలైన కళ్లు, కిడ్నీ, గుండె, నరాలు తదితర భాగాలు దెబ్బతింటాయి. అలాగే మద్యపానం, పొగ తాగడం, గుట్కాలు తదితర వ్యసనాల వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

సిబ్బందికి సహకరించాలి



జిల్లాలో నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలు సహకరించాలి. వైద్య సిబ్బంది ఇంటింటికి వచ్చి ఆరోగ్యపరమైన విషయాలు అడిగితే నిర్భయంగా వివరాలు చెప్పండి. ముందుగా క్యాన్సర్ వంటి వ్యాధులను గుర్తించడం ద్వారా చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు. ఈ సర్వే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. –కాంతరావునాయక్, జిల్లా ఇన్‌చార్జ్ ప్రోగ్రాం అధికారి, నంద్యాల

ముందస్తుగా గుర్తిస్తే నయం



క్యాన్సర్ రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మారిన జీవన శైలి, దూమ, మద్యపానాలు, పొగాకు సేవనం, వంశపారంపర్యం వంటి కారణాల వల్ల కేసుల సంఖ్య ఎక్కువవుతోంది. ఈ వ్యాధిని ముందే గుర్తిస్తే మెరుగైన వైద్యం అందించి నయం చేసే అవకాశం ఉంది. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. పరీక్షలపై ఎలాంటి అపోహలు అవసరం లేదు. –వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ, నంద్యాల

జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేయాలి



మహాసభలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నందికొట్కూరు: జిల్లా అభివృద్ధికి పాలకులు చిత్తశుద్ధితో పని చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, ధనలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని రాయల ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఎం రెండవ మహాసభ ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాటాలకు ప్రజలను సిద్ధం చేయాలన్నారు. జిలాల్లో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి విశాల ఐక్యవేదికను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపైన విద్యుత్ చార్జీల పేరుతో భారాలు మోపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా సీపీఎం నూతన కార్యదర్శిగా టీ. రమేష్‌కుమార్‌ను, కార్యదర్శివర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యతఈ మహాసభలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

నందికొట్కూరు: మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగంలో పని చేసే కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి నరసింహులు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీసం వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. విద్యార్హత, సీనియారిటీ మేరకు విధులు అప్పగించాలని చెప్పారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు శివరామ్‌ప్రసాద్, వెంకటరమణ, సన్వర్‌ఖాన్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

బాల్య వివాహాలను నిర్మూలించడం బాధ్యత



పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: సమాజంలో నేటికి జరుగుతున్న బాల్యవివాహాలను నిర్మూలించడం మనందరి నైతిక బాధ్యత అని ఐసీడీఎస్ ఏసీడీపీఓ మంగవల్లి, ఎంపీడీవో దాసరి మేరి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన కోసం అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చి బాలిక జీవితాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. బాలికల వయస్సు పెళ్లి వయసు 18 సంవత్సరాలు అని, బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు, బాలికల తల్లిదండ్రులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను అధికారులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగేశ్వరమ్మ, ఆశీర్వాదమ్మ, శేషమ్మ, వైద్యాధికారి విజయేంద్ర, ఏపీఎం పుల్లయ్య ఎంపీహెచ్‌వోలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీకమాస శివదీక్షా విరమణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం నుంచి ఈనెల 15 వరకు కార్తీకమాస శివదీక్షా విరమణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఈఓ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఐదు రోజుల పాటు పాతాళగంగ మార్గంలోని శివదీక్షా శిబిరాలలో ఈ దీక్షావిరమణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. నవంబరు 2న శివ మండల దీక్షను, 21న అర్ధ మండల దీక్షను స్వీకరించిన భక్తులు దీక్షా విరమణ సమయంలో దీక్షను విరమించవచ్చన్నారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు స్వామివారి ఆలయ దక్షిణద్వారం వద్ద స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేయించి విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం స్వామిఅమ్మవార్ల రథవీధిలో మంగళవాయిద్యాల మధ్య వేదమంత్రాలతో ఊరేగింపుగా తీసుకుని వెళ్లి శివదీక్ష శిబిరాలలో ఆశీనులను చేస్తారన్నారు. దీక్షావిరమణ చేసే భక్తుల కోసం మూడు వంతులుగా సిబ్బందికి శివదీక్షా శిబిరాలలో ప్రత్యేక విధులు కేటాయించామన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆకుకూరలతోపాటు పాలు, గుడ్లు, చేపలు, మాంసం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలన్నారు.



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ఆత్మకూరు: కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వి.లీలావతి, డీఎల్‌డీఓ సూర్యనారాయణ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో కిశోరి వికాసం మండల స్థాయి శిక్షకుల కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సూర్యకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో మానసిక ఆరోగ్యం–పోషకాహారం ఆవశ్యకతపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని, బాగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సూపర్‌వైజర్ పెద్ద మస్తానయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు శివకుమారి, కవిత, కోమలి, వినోలియా, అంజలి, రమాదేవి, కుమారి, ఆరోగ్య కార్యకర్తలు రత్నమ్మ, సామక్క, స్వర్ణలత, శారదమ్మ, పద్మావతి, మహేశ్వరమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

పాములపాడు: పంటల సాగుకు నాణ్యమైన విత్తనాలను రైతులు ఎంపిక చేసుకోవాలని ఎన్ఎస్‌సీ ఏరియా మేనేజర్ మోహన్‌రాజ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రం పాములపాడులో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెగుళ్లు, పురుగు మందుల వాడకంలో జాగ్రత్తలు వహించాలని, ఇష్టానుసారంగా వాడరాదని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి వాడుకోవాలని సూచించారు. సమావేశంలో నీటి సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కోట్ల నాగేశ్వర రెడ్డి, ఎన్ఎస్‌సీ అధికారులు మహేష్, శ్రీనివాసగౌడు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు హాజరు కావాలి

కొత్తపల్లి: మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులకు గ్రామాభివృద్ధి ప్రణాళికపై నిర్వహించే శిక్షణా కార్యక్రమాలకు అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై ఈ నెల 12,13 తేదీలలో అధికారులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పక్కాగృహాల నిర్మాణం, తాగునీటి సరఫరా తదితర మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రణాళికపై ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాలకు అధికారులతోపాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని తెలపారు.

బాలికల హక్కులకు భంగం కలిగించడం చట్టరీత్యానేరం

జూపాడుబంగ్లా: బాలికల మాన, ప్రాణాలు, హక్కులకు భంగం కలిగించడం చట్టరీత్యానేరమని ఎంపీడీఓ గోపికృష్ణ, ఏపీఎం అంబమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని వెలుగు కార్యాలయంలో కిషోరి బాలికల సంరక్షణ, హక్కులపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నానాటికి సమాజంలో బాలికలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోతున్న నేపథ్యంలో వారికి గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మలమ్మ, పావని తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ

మిడుతూరు: మండల కేంద్రం మిడుతూరు మండల సమాఖ్య భవనంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ, ఎంపీడీఓ దశరథరామయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతి హాజరయ్యారు. వారు మాట్లా డుతూ బాల్య వివాహాలు, లైంగిక దాడులు, వేధింపులపై గ్రామ, మండల స్థాయిలో కిశోర బాలికలకు అవగాహన కల్పించినప్పుడే కిశోర వికాసం లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సుబ్బయ్య, సీహెచ్‌ఓ రంగస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేణుకాదేవి, అనురాధ, అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మెట్ల పూజ

మహానంది: స్థానిక ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహానందితోపాటు సమీప గ్రామాల్లో అయ్యప్ప దీక్ష తీసుకున్న అయ్యప్పస్వాములు మహానందికి చేరుకుని పడిపూజల్లో పాల్గొన్నారు. అయ్యప్పస్వామికి పంచామృత అభిషేకం, నెయ్యాభిషేకం భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

రోడ్లపైకి ఆవులను వదిలితే చర్యలు

ఆత్మకూరు: రోడ్లపైకి ఆవులను వదిలితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు యజమానులను హెచ్చరించారు. మంగళవారం ఆవుల యజమానులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులపై ఆవులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయన్నారు. అవి రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పడుకోవడం, పరిగెత్తడం, గుంపులుగా చేరడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూడు రోజుల్లోగా ఆవులను తీసుకెళ్లకపోతే గోశాలలకు తరలిస్తామని హెచ్చరించారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ రత్నరాధిక



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శివరాముడు

ఆత్మకూరు: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారమవుతాయని తహసీల్దార్ రత్నరాధిక తెలిపారు. మంగళవారం మండలంలోని కురుకుంద, కొట్టాల చెరువు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు అర్జీల రూపంలో దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని భూ సమస్యలున్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తం రైతుల నుంచి 14 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు.

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం ఒకటవ సచివాలయంలో మంగళవారం హసీల్దార్ శివరాముడు రెవెన్యూ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు నుంచి అర్జీలను స్వీకరించారు. వినతులు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి 45 రోజుల్లోగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ చెప్పారు.

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాలలో మంగళవారం సర్పంచ్ ప్రకాశం అధ్యక్షతన తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 24 మంది రైతులు భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు సత్యదీప్,నాగన్న, సర్వేయర్ అతీఫ్, వీఆర్వోలు సాయిబాబా, బాలకృష్ణ, చంద్రశేఖర్‌నాయుడు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో మంగళవారం తహసీల్దార్ సుభద్రమ్మ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 7 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు రామస్వామి, డీటీ పఠాన్‌బాబు, ఆర్‌ఐ ఖజాబీ, సర్వేయర్లు సుప్రియ, కలిముల్లా, వీఆర్వోలు మగ్బుల్ ఉశేన్, శివన్న, ముర్తుజా, మద్దిలేటి, పురందరుడు, సామేలు, తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామంలో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ స్వామిరెడ్డి, ఆర్‌ఐ జహంగీర్, వీఆర్వో రామయ్య, రైతులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల పరిధిలోని పాతమాడుగుల పాఠశాల వద్ద మంగళవారం తహసీల్దార్ ఉమారాణి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సిద్దేశ్వరం భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 20 మంది రైతులు భూ సమస్యలపై వినతులు సమర్పించారని తహసీల్దార్ తెలిపారు.

వేల్పనూరులో 46 దరఖాస్తులు

వెలుగోడు: మండలంలోని వేల్పనూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 46 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాసగౌడ్ తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, వీఆర్వోలు జగదీష్, ఉగ్ర నరసింహుడు, సర్పంచ్ సర్దార్ మియా పాల్గొన్నారు

స్వయంగా విత్తనోత్పత్తి చేసుకోవాలి

వెలుగోడు: మండలంలోని వేల్పనూరు రేగడ గూడూరు గ్రామాల్లో మంగళవారం ఏఓ పవన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో గ్రామ విత్తన ఉత్పత్తి పథకం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ స్వయంగా విత్తనాలను ఉత్పత్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయం సమాజానికి నాణ్యమైన విత్తనాన్ని అందుబాటులో ఉంచడం గ్రామ విత్తన ఉత్పత్తి పథకం ఉద్దేశమన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో గ్రామీణ విత్తన ఉత్పత్తి క్షేత్రాలను పరిశీలించారు.



పంట పొలాల్లో రైతులతో మాట్లాడుతున్న ఏఓ పవన్ కుమార్

ప్రేమోన్మాదిని బహిరంగంగా శిక్షించాలి



బాలిక లహరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బాలికలు

నందికొట్కూరు: ప్రేమోన్మాదిని బహిరంగంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే జునైద్‌బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పటేల్ సెంటర్‌లో బాలిక మృతికి కారకుడు ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలంటూ మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బాలిక చిత్ర పటానికి పూలమాలలు వేసి బాలికలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక లహరిపై పెట్రోల్ పోసి నిప్పంటించి చంపేసిన రాఘవేంద్రను కాల్చి చంపాలన్నారు. బాలిక కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై, విద్యార్థినీలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత స్పందించి బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు గోపాల్, శివ, బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

జూపాడుబంగ్లా: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ విజయశేఖర్, నంద్యాల డీఆర్సీ సెంటర్ ఏఓ హేమలత, ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని తర్తూరు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటపొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వేసవిలో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, ఫలితాల ఆధారంగా రసాయనిక ఎరువులను తగిన మోతాదులో వాడుకోవాలని సూచించారు. బహిరంగ మార్కెట్లో ఆర్గానిక్ ఆహారదాన్యాలకు అధికంగా డిమాండ్ ఉన్నందున రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. రబీలో సాగు చేసిన పంటలకు డిశంబర్ 15లోగా బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు.



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏడీఏ